క్లుప్తంగా

ఆహారం ప్యాకెట్ల పంపిణీ



అన్నం పంపిణీ చేస్తున్న హెల్పింగ్ ఆర్గనైజింగ్ టీం సభ్యులు

కొత్తపట్నం: రోడ్ల వెంట భిక్షాటన చేసే అనాథలు, వికలాంగులు, వృద్ధులకు మదర్ థెరీసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ద్విచక్ర వాహనాలతో తిరిగి రోడ్ల వెంట భిక్షాటన చేసే వారికి భోజనాలు సరఫరా చేశారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు, సీనియర్ కళాకారుడు మిట్నసల శాంతారావు పుట్టిన రోజు సందర్భంగా వారి కుమార్తెలు ఎం.శరణ్య, ఎం.విద్యారణ్య సొంత నిధులతో సహాయం చేశారు. వారికి మదర్ థెరీసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ టీం దరబునా కృతజ్ఞతలు తెలిపారు. హెల్పింగ్ టీమ్ డి.కేశవ, ఎం.సునీల్, డి.సుజీత్, ఎం.రాజ్‌కుమార్, ఎం.చంద్ర, ఎం.బాబు, ఎం.ప్రసాద్, ఎం.సన్నీ, బి.డానియల్, జె.నాని పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారం



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని సమతా నగర్ మంచినీటి సమస్యను మంగళవారం పరిష్కరించారు. మంచినీటి పైపులైన్ వాల్వు వద్ద సమస్య ఉన్నట్లు గుర్తించి వెంటనే మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేశారు. సమతా నగర్‌లో మంచినీటి సమస్య ఉన్నట్లు స్థానికులు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే కమిషనర్ ఎంఈ కె.మాల్యాద్రితో పాటు సిబ్బందిని, కమిషనర్ అక్కడకు తీసుకెళ్లి మరమ్మతులు చేయించారు.

లబ్ధిదారుల వీడియోలు అప్‌లోడ్ చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ హేమలత

మద్దిపాడు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన, అర్బన్ హౌసింగ్ ద్వారా గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులను గుర్తించాలని హౌసింగ్ ఏఈ హేమలత ఆదేశించారు. మంగళవారం మద్దిపాడులో మాట్లాడుతూ నిర్మిత గృహాలకు ప్రధాన మంత్రి అవార్డులు ఇవ్వనున్న నేపథ్యంలో ప్రతిపాదనలు పంపాల్సి ఉందని తెలిపారు. వారు గతంలో పడిన ఇబ్బందులు, ప్రస్తుతం ఇంటి నిర్మాణం తరువాత గడుపుతున్న సంతోషకరమైన జీవనం తెలిసేలా అవగాహన కల్పిస్తూ సదరు వీడియో క్లిప్పింగ్‌లను తయారు చేసి హౌసింగ్ యాప్‌లో అప్‌లోడు చేయాలన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు సంజయ్, పున్నారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సజ్జ సాగులో అధిక దిగుబడులు సాధ్యం



శివరామపురంలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (ముండ్లమూరు): సజ్జ పంట సాగు చేసిన రైతులు సమగ్ర పంట సాగు పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొంద వచ్చని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. శివరామపురంలో మంగళవారం పలు సూచనలు చేశారు. వీఏఏ రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: లక్నోలో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటిన రాక్‌వెల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను డైరెక్టర్ వెన్నా నాగార్జున రెడ్డి, సింధూజ అభినందించారు. మంగళవారం స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 16న విజయనగరంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విద్యార్థులు సాత్విక, నిఖిల్, హిమవర్షిణి, పార్థు పాల్గొన్నారని తెలిపారు. 152 సెం.మీ విభాగంలో నిఖిల్, 164 సెం.మీ విభాగంలో సాత్వికా రెడ్డి గోల్డ్‌మెడల్ సాధించి లక్నోలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించినట్లు వివరించారు. కోచ్ ముఖేష్ కుమార్‌ను కూడా అభినందించారు.

పల్లెల పరిశుభ్రత ముఖ్యం



కె.పల్లెపాలెం గ్రామంలో పర్యటిస్తున్న డీపీవో నారాయణరెడ్డి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీపీవో నారాయణరెడ్డి, ఆనందరావు, అధికారులు

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పించిందని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా కె.పల్లెపాలెంలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ లక్ష్యాలపై పోస్టర్లు ఆవిష్కరించి అవగాహన కల్పించారు. సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు అధ్యక్షత వహించారు. డీపీవో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాముఖ్యత ఇవ్వాలని, క్లాప్ మిత్రల ద్వారా గృహాల్లోని తడి పొడి చెత్త సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. వీటి నిర్వహణ ఏ విధంగా జరుగుతుందో గ్రామంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సమగ్ర పారిశుద్ధ్యం సాధించడం కోసం చిన్న పిల్లలకు, మరుగుదొడ్ల వినియోగం తరువాత చేతులు సబ్బుతో పరిశుభ్రంగా చేసుకోవడాన్ని నేర్చుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. వలంటీర్లు, మహిళా సంఘాల ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ లక్ష్యాలపై పోస్టర్లను పంపిణీ చేసి క్షేత్ర స్థాయిలో ఇంటిలో ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండే విధంగా వివరించాలన్నారు. వ్యర్థాల రీసైక్లింగ్ కోసం గ్రామంలో ఎన్నికైన చెత్త సంపద తయారీ కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. పరిశుభ్రత ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన నాణ్యతను మెరుగు పరచాలని సూచించారు. డీపీవో కొన్ని గృహాలను పరిశీలించి సోక్‌పిట్ల నిర్వహణ, స్వచ్ఛ సర్వేక్షణ లక్ష్యాలను ప్రజలకు వివరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ లక్ష్యాలైన బహిరంగ మలవిసర్జన రహిత గ్రామం, వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి నిర్వహణ, మల వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై డీపీవో వివరించారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈఓఆర్డీ ఏ.బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి మణిదీప్, రిసోర్స్ పర్సన్ రామ్మోహన్, సచివాలయం సిబ్బంది, ఆశవర్కర్లు, ఎస్‌హెచ్‌జీ మెంబర్స్, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృ వియోగం బాధాకరం



రామకృష్ణారెడ్డి తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి

మద్దిపాడు: మాతృమూర్తి వియోగం బాధాకరమని స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. గుండ్లాపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు లింగా రామకృష్ణారెడ్డి తల్లి పెద్ద కర్మ కార్యక్రమానికి దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డితో కలిసి మంగళవారం హాజరయ్యారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారు బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, సంతనూతలపాడు అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, మద్దిపాడు పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, సీనియర్ నాయకులు పరంధామిరెడ్డి, గట్టినేని అయ్యన్న, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గుండ్లాపల్లి ఎంపీటీసీ పల్లకి పద్మకుమారి, మహానందరెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు నర్రా సురేష్, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నియామక పత్రాల పంపిణీ



నియామక పత్రాలు అందిస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఒంగోలు స్కిల్ హబ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మంగళవారం ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. తన చాంబరు వద్ద జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్ల పంపిణీ అనంతరం ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో న్యాక్ ఒంగోలులో ఉచిత శిక్షణ అందించిందన్నారు. జిల్లాలో 8 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్‌లలో నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ, ఉపాధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించి ఎలక్ట్రీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, నియామక పత్రాలు అందించామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. మంగళవారం 26 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వారిలో జ్యోతి గ్రానైట్, మురళి ఎలక్ట్రికల్ వర్క్స్, బాలాజీ మున్సిపల్ వర్క్స్, పండు ఎలక్ట్రికల్ అండ్ శానిటరీ వర్క్స్, చందు ఎలక్ట్రికల్ అండ్ శానిటరీ వర్క్స్, వర్మ ఎలక్ట్రికల్ అండ్ శానిటరీ వర్క్స్, చెన్నకేశవ ఎలక్ట్రికల్ వర్క్స్ కంపెనీల్లో నియామకపత్రాలు పొందారన్నారు. ఆసక్తి కలిగిన వారు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ లేదా ప్లంబర్ జనరల్ కోర్సుల్లో శిక్షణకు చేరదలుచుకుంటే నేరుగా ఒంగోలులోని న్యాక్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్, న్యాక్ ఏడీ నాగశ్రీను పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



బంద్‌లో పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఒంగోలు టౌన్: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని విద్యార్థి నాయకులు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నగరంలో మంగళవారం పలు విద్యా సంస్థలను మూసివేశారు. జీవో నెంబర్ 77 రద్దు చేయాలని, డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశ పెడుతున్న మేజర్, మైనర్ విధానాన్ని విరమించుకోవాలని, బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. 3,4,5 తరగతుల విలీన ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని, బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సి.హెచ్.లక్ష్మారెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బాల చంద్ర నాయక్, ఆర్‌ఎస్‌యూ నాయకులు నాగరాజు, వెంకటేశ్, వినయ్, రాఘవ, సైదా, ఆనంద్ పాల్గొన్నారు.

దేశ ఆత్మగౌరవ పతాకం మహాకవి జాషువా



గుర్రం జాషువా, కృష్ణ చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: అరుదైన వ్యక్తిత్వంతో నిమ్నజాతుల గొంతుకను బలంగా వినిపించిన మహాకవి గుర్రం జాషువా దేశ ఆత్మగౌరవ పతాకంలా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని నాగభైరవ సాహితీ పీఠం అధ్యక్షుడు డా. నాగభైరవ ఆదినారాయణ అన్నారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో మంగళవారం సాహితీ దిగ్గజాలు గుర్రం జాషువా, పీవీ కృష్ణ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. డా.నూనె అంకమరావు అధ్యక్షత వహించగా.. సమకాలీన సామాజిక మార్పు కోసం జాషువా అనేక రచనలు చేశారని కొనియాడారు. ఆడిటర్‌గా ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే సాహిత్య రంగంలో క్రియాశీలకపాత్ర పోషించిన పీవీ కృష్ణ తెలుగు సాహిత్యంలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. తొలుత నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా, పీవీ కృష్ణ చిత్రపటాలకు నివాళులర్పించారు. మిడసల మల్లికార్జునరావు, కనకమాల రాఘవులు, గుంటూరు సత్యనారాయణ, డా.సంతవేలూరి కోటేశ్వరరావు, యూవీ రత్నం, జ్యోతి గోపాలరావు, సింగయ్య, శాంతారావు పాల్గొన్నారు.

జామ పెంపకంలో యాజమాన్య పద్ధతులు



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త శివ

దర్శి: జామ పంటలో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన వన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ సూచించారు. కొర్లమడుగులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ రమణారెడ్డి, డీబీఆర్‌సీ మండల కోఆర్డినేటర్ నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఒంగోలు టౌన్: స్థానిక ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో స్వామి వారి మాస కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మంగళవారం రాత్రి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వాహణాధికారి డి.రజని, సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, దేవస్థాన అర్చకులు పి.రామనాథా చార్యులు, నాగార్జునదేవ్, రాంబాబు పాల్గొన్నారు.

పేస్‌లో మెగా రక్తదాన శిబిరం



ప్రశంస పత్రం అందిస్తున్న డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: పేస్ కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని కాలేజీలో విద్యార్థులు, అధ్యాపకులు వందమంది మంగళవారం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం రిమ్స్ బ్లడ్ బ్యాంకు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించారు. అనంతరం కాలేజీ ఆవరణలో మొక్కలను నాటారు. కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా కాలేజీలోని ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఒక మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ ప్రశంస పత్రాలు అందించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ఏవో ఎం.రమణబాబు, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్.వీరాంజనేయులు పాల్గొన్నారు.

రైల్వే స్వాగత బోర్డును ఢీకొన్న లారీ

దొనకొండ: దొనకొండ రైల్వే స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన స్వాగతం బోర్డును పత్తి లోడు లారీ ఢీ కొట్టిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. కడప ప్రాంతానికి చెందిన లారీ కనిగిరి ప్రాంతంలో పత్తి లోడు వేసుకుని దొనకొండ మీదుగా గుంటూరు వెళుతోంది. లారీ డ్రైవరుకు దారి అవగాహన లేక పోవటంతో స్థానిక అడ్డరోడ్డు నుంచి గుంటూరుకు వెళ్లకుండా దొనకొండ టౌన్‌లోకి వచ్చి రైల్వే స్వాగతం బోర్డును బలంగా ఢీ కొట్టడంతో విరిగి పోయింది. కానిస్టేబుల్ లారీని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. రైల్వే రక్షక దళం ఏఎస్‌ఐ క్రాంతికుమార్ కేసు నమోదు చేశారు.

మిస్సింగ్ కేసు నమోదు

దర్శి: లింగాల నాగరాజు అనే (19) యువకుడు కనిపించలేదని తండ్రి లింగాల చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామకృష్ణ మంగళవారం కేసు నమోదు చేశారు. మేళం వాయించేందుకు నాగరాజు వెళ్తుంటాడు. అందులో భాగంగా ఆటో ఎక్కి దర్శికి వెళ్లిన తర్వాత ఇంటికి రాలేదు.

మినీ లారీ బోల్తా .. తప్పిన ప్రమాదం



బోల్తా పడిన మినీ లారీ

ముండ్లమూరు: మండలంలోని వేంపాడు చిలకలేరు వద్ద అదుపు తప్పి కూరగాయల లోడ్‌తో వెళుతున్న మినీ లారీ బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. మంగళవారం గుంటూరు నుంచి మార్కాపురం వెళుతున్న మినీ లారీ దర్శి – అద్దంకి ప్రధాన రహదారిలో వేంపాడు చిలకలేరు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించ బోయి అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది.

నేటి నుంచి అంబవరం రైల్వే బ్రిడ్జి రోడ్డు మూసివేత

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న అంబవరం రైల్వే బ్రిడ్జి రోడ్డును బుధవారం నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే డంబ్లింగ్ పనుల్లో భాగంగా అంబవరం రైల్వే బ్రిడ్జి వద్ద పనులు చేయనున్న నేపథ్యంలో అంబరం గ్రామ వైపు వెళ్లే జయరాంపురం, జయరాంపురం తండా, వెల్లుపల్లె, వెంగళరెడ్డిపల్లె గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

గృహ నిర్మాణాలకు సహకరించండి



ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న శ్రీనివాసరావు

కొత్తపట్నం: ప్రతి గృహిణి వాస్తవ స్థితిగతులు తెలుసుకుని వారికి గృహాలు పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలని క్లస్టర్ లెవల్ టెక్నికల్ సెల్ కాకి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న లేఅవుట్లు గురించి ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహాలు నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో కొత్తపట్నం మండలం జగనన్న లేఅవుట్లను పూర్తి చేసి బహుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రతి లేఅవుట్ సంబంధించిన లబ్ధిదారులతో మాట్లాడి స్టేజ్ కన్వర్షేషన్ చేయాలని అడ్వాన్స్ పేమెంట్స్ ముందుగా బీఎల్, ఎల్ఎల్, ఆర్ఎల్ ఉన్న ప్రతి ఒక్కరికి రూ.20 వేలు రిలీజ్ చేయాలని తెలిపారు. కన్సల్ట్ ఫాం అప్‌లోడ్ చేస్తేనే లబ్ధిదారులకు సిమెంట్, స్టీల్ ఇవ్వటానికి అవకాశం ఉంటుందన్నారు. మెటీరియల్ సిద్ధంగా ఉందని, ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, హౌసింగ్ డీఈ వెంకటనారాయణరెడ్డి, ఏఈ నాంచార్లరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో రైతు కూలీలకు ద్రోహం



సదస్సులో మాట్లాడుతున్న రైతు నాయకులు చుండూరి

ఒంగోలు టౌన్: దేశానికి అన్నం పెట్టే రైతు కూలీలను ద్రోహం చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా పోరాటం చేస్తామని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు చెప్పారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో మంగళవారం జరిగిన రైతు కూలీ సదస్సులో మాట్లాడారు. ఢిల్లీ రైతు ఉద్యమంలో అమరులైన రైతు కుటుంబాలను ఆదుకుంటానని, 2022 విద్యుత్ సవరణ బిల్లు వెనక్కి తీసుకుంటానని రాతపూర్వకంగా హామీ ఇచ్చిన మోదీ ఏడాదిన్నర గడుస్తున్నా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఈ నెల 30న విజయవాడలో నిర్వహించనున్న కర్షక కార్మిక సదస్సును జయప్రదం పిలుపునిచ్చారు. పేదలకు అత్యధిక భారంగా మారిన విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమాన్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశ ప్రజలను నిలువునా దోచుకుంటున్న మోదీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య కోరారు. లకింపూర్ ఘటనకు కారకుడైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘ రాష్ట్ర నేత చిట్టిపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఎస్.లలిత కుమారి, ఎస్.కె.మహబూబ్, ఎన్.నాగరాజు, పద్మ, నాంచార్లు పాల్గొన్నారు.

మణిపూర్ ప్రభుత్వ తీరు సిగ్గుచేటు



మణిపూర్ ఘటనలపై నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఐ



ఒంగోలు: ప్రదర్శన నిర్వహించిన స్త్రీ విముక్తి సంఘటన



ఒంగోలు: మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కొవ్వొత్తుల ప్రదర్శన

ఒంగోలు టౌన్: సభ్య సమాజం సిగ్గుపడేలా మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగిక దాడి చేసిన ఘటనలో మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి డిమాండ్ చేశారు. మంగళవారంలో అద్దంకి బస్టాండ్ సెంటర్లో మణిపూర్ ఘటనలకు కారణమైన వారిని శిక్షించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. గత మూడు నెలలుగా మణిపూర్ ఘర్షణలతో మండిపోతుంటే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రోమ్ చక్రవర్తిలా చోద్యం చూడడం దారుణమని మండిపడ్డారు. మతోన్మాదులు ఊర్లకు ఊర్లనే తగులబెడుతున్నారని, గిరిజన మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం అండదండలతోనే అల్లరిమూకలు రెచ్చిపోతున్నాయని విమర్శించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్న పాలక వర్గాలను ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీనియర్ నేత ఎస్డీ సర్దార్ పిలుపునిచ్చారు. కందుకూరి సుభాన్ నాయుడు, ఎంఏ సాలార్, సి.హెచ్. వెంకటేశ్వర్లు, పంతులు, ఆర్.నాగేశ్వరరావు, యానాది రెడ్డి, బాష పాల్గొన్నారు.

మణిపూర్ చిచ్చుకు ప్రభుత్వానిదే బాధ్యత

ఒంగోలు టౌన్: శతాబ్దాలుగా కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య విద్వేషాలను రగల్చిన పాపం బీజేపీ పాలకులదేనని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీరాం శ్రీనివాసులు విమర్శించారు. మంగళవారం కొవ్వొత్తులతో సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. మణిపూర్ కొండల్లో బయటపడిన అత్యంత విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే అల్లరిమూకలను స్వేచ్ఛగా వదిలిపెట్టారని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ గుండాలు గిరిజన క్రిస్టియన్లపై క్రూరంగా దాడులు చేయడమే కాకుండా చర్చీలను తగలబెట్టడం లాంటి రాక్షసకృత్యాలకు పాల్పడుతున్నారని చెప్పారు. సభ్యసమాజం తలవంచుకునే దారుణమారణాలకు, అత్యాచారాలకు పాల్పడుతున్నవారిపై కేసులు పెట్టకుండా బీజేపీ ప్రభుత్వం పరోక్షంగా వారిని ప్రోత్సహిస్తోందన్నారు. కొనిపాటి శ్రీనివాసరావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

దోషులను వెంటనే శిక్షించాలి

మణిపూర్‌లో కుకి ఆదివాసీ మహిళలపై జరిగిని అమానుష దాడులకు కారణమైన వారిని వెంటనే శిక్షించాలని స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి పి.శాంతకుమారి డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులు, బీజేపీ కలిసి మణిపూర్‌లో ఆరని చిచ్చు రగల్చారని విమర్శించారు. మణిపూర్‌లో అల్లర్లను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కుకీ, మెయితి తెగల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి బీజేపీ పాలకులు ఆదివాసీల హక్కులను హరించే కుట్రలకు పాల్పడుతున్నారని ఓపీడీఆర్ జిల్లా అధ్యక్షులు కత్తి పేరయ్య విమర్శించారు. నగరంలోని ఈమని పాలెం నుంచి చర్చి సెంటర్, ప్రకాశం భవనం మీదుగా తరిమెల నాగిరెడ్డి భవనం వరకు ప్రదర్శన నిర్వహించారు. రాజ్యలక్ష్మి, ప్రసన్న, నజీర్ బాష, కె.హనుమంతరావు, కోటేశ్వరరావు, ఇండ్ల విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పండి

ఒంగోలు టౌన్: మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జాలా అంజయ్య, కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నాగ, కుకి ఆదివాసీలపై జరుగుతున్న మారణహోమాన్ని ఆపాలని, మహిళలను నగ్నంగా ఊరేగించి నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. గత మూడు నెలలుగా మణిపూర్ ఘర్షణల్లో 164 మంది చనిపోయారని, 300 చర్చీలకు పైగా ధ్వంసం చేశారని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయన్నారు. లెక్కల్లోకి రాని ఘటనలు ఇంకెన్ని ఉన్నాయో చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ ఘటనలకు బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి మోదీ, హోం మంత్రి అమిత్ షాలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పి.కల్పన, బి.అనూష, ఆశాబీ, టి.మహేష్, తంబి శ్రీనివాసులు, కంకణాల వెంకటేశ్వర్లు, వినోద్ పాల్గొన్నారు.